# అమెరికా గ్లామరు

పోయిన ఏడాది నాకు సియాటిల్‌నించీ ఒక ఫోన్‌కాల్ వచ్చింది. చిరకాల మిత్రుడు సూర్యారావ్. 'బాగున్నారా?' అని అడిగాడు. అతని గొంతు విని కనీసం రెండు దశాబ్దాలైనా అయివుంటుంది కనుక అసలు గుర్తు పట్టలేదు.

'నేను సూర్యారావుని. ఫలానా చోట మనిద్దరం కలిసి పనిచేశాం' అంటుండగానే గుర్తుకి వచ్చాడు.

'అరె. మీరు గుర్తులేకపోవటమేమిటి. కాకపోతే చాలా రోజులయిందేమో ఎప్పుడు వచ్చారు? ఏ వూళ్ళో వున్నారు?' అడిగాను.

'సియాటిల్లో. మా అమ్మాయి సునీత గుర్తుందా. ఇక్కడే వాళ్ళాయనతో వుంటున్నది. వచ్చే నెల డెలివరీ. అందుకని నేను వచ్చాను' అన్నాడు.

'మరి సుజాతగారు రాలేదా?' అడిగాను.

నవ్వాడు. 'లేదు. అసలు నన్నుకూడా రావద్దన్నది మా అమ్మాయి. ఇక్కడ అన్నీ హాస్పిటల్‌వాళ్ళే చూసుకుంటారు అనవసరం అంది. కానీ నేనే వచ్చాను. సుజాత అక్కడే చెన్నయ్‌లోనే వుంది, మా రెండోది కాలేజీలో వుంది కదా దానికి తోడుగా... ' అన్నాడు.

కాసేపు పాతరోజుల మధురస్మృతులు మాట్లాడుకున్నాం. దాదాపు ఆనాటి మా అందరి స్నేహితుల పిల్లలూ అమెరికాలోనే వున్నారుట. కొంతమంది చదువుల కోసం వచ్చి అమెరికాలోనే వుండిపోతే, ఇంకొందరు పెళ్ళిళ్ళు చేసుకుని భర్తలతో అమెరికా వచ్చేశారుట.

'ఇండియాలో ఇప్పుడదొక వేలం వెఱ్రి అయిపోయింది. ఇరవై ముప్ఫయ్ ఏళ్ళ వయసులో వుండి చదువుకున్న వాళ్ళందరికీ అమెరికా రావాలనే... ' అన్నాడు.

అతని అభిప్రాయం కనుక్కుందామనే ఉద్దేశ్యంతో అడిగాను 'ఎందుకని అమెరికా మీద అంత గ్లామరు.' అని.

సూర్యారావు కూడా నాలాగానే అన్నీ ఎనలైజ్ చేసి మాట్లాడతాడు. అందుకనేనేమో మా ఇద్దరికీ ఆ రోజుల్లో స్నేహం త్వరగా కలిసింది.

సాలోచనగా అన్నాడు 'ఎందుకంటారా. రకరకాల కారణాలుండచ్చు. మీ

రోజుల్లో చదువుకోవటానికి వచ్చేవాళ్ళూ, మంచి ఉద్యోగావకాశాల కోసం వచ్చేవాళ్ళూ ఎక్కువయితే, ఆరోజుల్లో లేని కారణాలు ఈరోజుల్లో కొన్ని వున్నాయి. ఎక్కడచూసినా ఔట్‌సోర్సింగ్ ఎక్కువయిపోయింది. దాంతో మన వాళ్ళ రాకపోకలూ ఎక్కువయాయి. నాయుడి ధర్మమా అని, మన ఆంధ్రాలోనే ముందూవెనకా చూసుకోకుండా దాదాపు మూడువందల ఇంజనీరింగ్ కాలేజీలు పుట్టగొడుగుల్లా ఎక్కడపడితే అక్కడ, పూరి గుడిశల్లో కూడా, మొలుచుకువచ్చాయి. వాటిల్లో చాల కాలేజీల్లో సరైన స్టాఫూ వుండరు, ఫెసిలిటీసు లేవు. కొన్ని కాలేజిలు పేరుకి ఐటీ కానీ కంప్యూటర్లు కూడా లేని టీ షాపులు. కొంతమంది కాలేజీకి వెళ్ళకుండా మార్కులు కొనుక్కునే వాళ్ళు కూడా వున్నారంటే ఆశ్చర్యపోనఖ్ఖరలేదు. ఇన్ని వందల కాలేజీలనించీ, ఏటేటా ఎన్నో వేలమంది బయటికి వస్తున్నారు. వాళ్ళందరికీ ఉద్యోగాలిచ్చేంత ఐటీ ఇండస్ట్రీ మన ఆంధ్రదేశంలో లేదు. అందుకే ఎక్కడ చూసినా, అటు బెంగుళూరులాటి దేశీ నగరాల్లోనూ, ఇటు అమెరికాలాటి విదేశాల్లోనూ ఎక్కడ చూసినా మన తెలుగువాళ్ళే....' ఇలా చెప్పుకుంటూ పోయాడు.

అతని మాటలు విని చాల రోజులయిందేమో ఉత్సాహంగా విన్నాను. వాటిలో నిజాలు ఎంత శాతం వున్నాయో కానీ, వివరణ మాత్రం బాగుంది.

ఒక విషయం అడగాలి అంటూనే అడగదలుచుకున్నది చెప్పేశాడు. 'నాకు ఆరునెలలు వీసా ఇచ్చారు. ఇండియాలో రిటైర్మెంట్‌కింకా నాలుగేళ్ళుంది. ఏదన్నా మంచి ఉద్యోగం దొరికితే అమెరికాలోనే వుండిపోదా మని వుంది. నా చదువూ క్వాలిఫికేషన్లూ మీకు తెలుసు. నా కెక్కడయినా మంచి ఉద్యోగం వస్తుందంటారా? మీరేమయినా సహాయం చేయగలరా?' సూటిగా అడిగాడు.

అది విని ఆశ్చర్యం వేసింది. ప్రశ్న అలా వస్తుందని అనుకోకపోవటమేకాక, ఆ వయసులో అమెరికాలో జీవితం మొదలుపెట్టటం అంత సులభం కాదు కూడా. కానీ అవేమీ మాట్లాడకుండా అన్నాను. 'మీరు ఏ వీసా మీద వచ్చారు?' అని.

'విజిటర్స్ వీసా మీదే. విజిటర్స్ వీసా మీద ఉద్యోగాలు చెయ్యటానికి వీలు లేదనీ, అది ఇల్లీగల్ అనీ తెలుసు. అయినా ఇక్కడ ఎవర్నయినా పట్టుకుని మేనేజ్ చెయ్యచ్చని చెప్పాడు సుకుమారన్. కాకపోతే మీ పలుకుబడిని ఉపయోగించి, నాకు ఉద్యోగం వచ్చేటట్టు చేయగలరా' అన్నాడు.

అంత్య నిష్ఠూరం కన్నా ఆది నిష్ఠూరమే నయమని అన్నాను.

'ఉద్యోగం వస్తుందా లేదా మీ అర్హతలు ఇటు ఇంజనీరు ఉద్యోగానికి సరిపోతాయా, ఇక్కడి సంస్కృతికీ భాషకీ ఆఫీసు వాతావరణానికీ ఎంత త్వరలో ఎడ్జస్టు కాగలరూ, జీతం ఎంట్రీ లెవెల్లో ఇస్తే సర్దుకోగలరాలాటి ప్రశ్నలున్నా, ఆలోచించాల్సినవి ఎంతో ముఖ్యమైనవి వున్నాయి. వాటిలో చాల ముఖ్యమైనది వీసా. మీకు వీసా ఇచ్చినప్పుడు వాళ్ళు చూసేది మీరు ఆరు నెలలూ అయిపోగానే వెనక్కి తిరిగి వెళ్ళిపోతారా లేదా అని. ఆ వీసా మీద వచ్చి ఏ అనారోగ్య సంబంధ కారణం చేతో వీసా తేదీని న్యాయసమ్మతంగా పెంచుకుని వుండటం తప్ప, ఇక్కడ వుండటం చట్ట ధిక్కారమవుతుంది. అలాటి వారిని, ఇమ్మిగ్రేషన్ డిపార్ట్‌మెంట్ వెతికి

పట్టుకుని ఇండియాకి పంపించిన కేసులుకూడా వున్నాయి. అంతేకాదు స్పాన్సర్ చేసిన వాళ్ళుకూడా ఇరుకులో పడే ప్రమాదముంది... ' అన్నాను.

'ఇటువంటివి మేనేజ్ చేయచ్చని చెప్పాడు సుకుమారన్' అన్నాడు.

నేనూ నవ్వి 'అలాటివి నేనెప్పుడూ వినలేదు ఈ దేశంలో. అలాటి ప్రయత్నాలు చేయటం వల్ల పని జరగటం కన్నా ప్రమాదంలో పడటానికే అవకాశాలు ఎక్కువున్నాయి. సరే. అక్కడ వాతావరణం ఎలావుంది. బాగా వాన పడుతున్నదా' అని మాట మార్చాను.

అలాటిదే ఇంకొక అనుభవం. ఆమధ్య ఒక దూరుపు చుట్టం ఇండియానించీ ఫోన్ చేశాడు. సారాంశం ఏమిటంటే తనూ తన భార్యా విజిటర్స్ వీసా మీద వస్తున్నామనీ ఆ విషయం మాట్లాడాలనీ అన్నాడు. చివరికి చెప్పిం దేమిటంటే, అమెరికాలో వున్న ఆరు నెలల్లోనూ తనకి ఏదన్నా పార్ట్‌టైం ఉద్యోగం చేసి కాస్తోకూస్తో సంపాదించుకుందామని వుందనీ, దానికి నా సహాయం కావాలనీ. ఆయనకి కూడా సూర్యారావుకి చెప్పినదే టేప్ రికార్డర్ రీప్లేలా అక్షరం పొల్లు పోకుండా చెప్పాను. ఆయనకి వాళ్ళ ఉద్యోగ ప్రయత్నం చేసుకుందామనుకుంటుంటే నేనేదో సైంధవుడిలా అడ్డం పడుతున్నాననిపించినట్టుగా వుంది. పైకి అనలేదు కానీ అన్నంత పని చేశాడు.

వీళ్ళందరికన్నా నాకు బాగా నచ్చింది నరసింహారావుగారు. ఆయన మాకు తెలిసిన మిత్రులు సంధ్యకి నాన్నగారు. ఇండియాలో గుంటూరు జిల్లాలో ఒక పల్లెటూరిలో ఆయనే డెభ్భయేళ్ళు వచ్చినా పొలం పనులు తనే చూసుకుంటాడు. బాగా చదువుకున్న మనిషి. చదువు అంటే డిగ్రీలు కాదు. ఇటు ఆధ్యాత్మికమూ, అటు మార్క్సిజమూ క్షుణ్ణంగా చదివాడు. రాజకీయాలే కాకుండా తెలుగు సాహిత్యం గురించి అనర్గళంగా మాట్లాడ గలడు. ఇంగ్లీషు మాట్లాడుతాడు. ఆయనా విజిటర్స్ వీసామీద అమెరికా వచ్చి కూతురు అల్లుడు దగ్గర వున్నాడు. నేను ఆయన్ని కలిసినప్పుడు ఎన్నో రకాల విషయాల మీద చక్కగా మాట్లాడుకున్నాం కూడా. అప్పుడే అన్నాడాయన 'మరీ ఇంట్లో కూర్చుంటే బోరు కొడుతున్నదని ప్రతిరోజూ ఇక్కడ లైబ్రరీకి వెళ్ళి పుస్తకపఠనం మొదలుపెట్టాను. ఒకరోజు లైబ్రరీ అమ్మాయితో మాట్లాడుతూ మొహమాట పడుతూనే అడిగాను - ఏదన్నా వాలంటీరు పని వుంటే కాలక్షేపం కోసం ఉచితంగా చేద్దామనుకుంటున్నానని. అప్పటినించీ అక్కడ పుస్తకాలు సర్దటంనించీ చిన్న చిన్న పనులు చేయటం ఏమీ పని లేకపోతే పుస్తకాలు చదువుకోవటం. లైబ్రరీలు గుడులు. గుడిలో పుణ్యం సంగతి ఏమో కానీ, లైబ్రరీలలో ఎంతో జ్ఞానం సంపాదించుకోవచ్చు. అందుకేనేమో వాటిని గ్రంథాలయాలు అని ఒక ఆలయంలాగా చెబుతారు తెలుగులో' అన్నాడాయన.

పుస్తకాలు చదవటం మీదా, గ్రంథాలయాల మీదా నా అభిప్రాయం అదే కనుక వెంటనే ఒప్పేసుకున్నాను.

0 0 0